
హైదరాబాద్ వార్త



# మైనంపల్లికి బుజ్జగింపులు

**హనుమంతరావు పార్టీ మారితే ఎఫెక్ట్ తప్పదనే భయం**

**రంగంలోకి గులాబీ కీలకనేత**



హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త : మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇటీవల మెదక్ ఎమ్మెల్యే టికెట్ తన కొడుకుకు రాకుండా మంత్రి హరీశ్‌రావు అడ్డుకుంటున్నారంటూ.. చేసిన పలు కామెంట్స్ పార్టీలో పెద్ద దుమారాన్నే రేపాయి. ఆయనపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. కాని పార్టీ పెద్దలు మైనంపల్లి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనను దారిలోకి తెచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రస్తు తం పరిస్థితుల్లో ఆయనను పార్టీ నుంచి పంపేస్తే ఆ ప్రభావం గ్రేటర్ పరిధిలోని మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్ తదితర నియోజకవర్గాలతో పాటు మెదక్ జిల్లాపై పడుతుందని బిఆర్ఎస్ భయపడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అందుకే గులాబీ పెద్దలు ఆయనపై చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉంటున్నారనే అనుమానం పార్టీ శ్రేణులను వెంటాడుతున్నది.

మైనంపల్లికి మల్కాజిగిరి టికెట్టును అధిష్టానం కట్టబెట్టినా ఆయన సంతృప్తి చెందలేదు. కొన్ని రోజులుగా పార్టీ నేతలకు దూరంగా ఉంటున్నారు. త్వరలోనే ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తున్నది. అదే జరిగితే పలు సెగ్మెంట్లలో బిఆర్ఎస్‌పై ప్రభావం పడే చాన్స్ ఉన్నది. దీంతో పార్టీ అధిష్టానం మైనంపల్లిని బుజ్జగించేందుకు ఓ కీలకనేతకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. సదరు నేతపై మైనంపల్లికి మొదడి నుంచీ మంచి అభిప్రాయం ఉన్నదని టాక్. ఆ నేత రంగంలోకి దిగిన తర్వాత మైనంపల్లి బిఆర్ఎస్‌ను వీడాలనే నిర్ణయాన్ని మార్చుకుంటారని అధిష్టానం ఆశిస్తున్నది. కాగా, "బిఆర్ఎస్‌లో పెద్ద నాయకుడు నాకు ఫోన్ చేశారని, మీడియాతో మాట్లాడవద్దని నాతో ఒట్టు వేయించుకున్నాడని.. తొందర పడవద్దని నాకు చెప్పారని" శనివారం తన నివాసంలో మీడియా ముందు మైనంపల్లి చేసిన సంచన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. అయితే మైనంపల్లితో ఒట్టు వేయించుకున్న ఆ నేత ఎవరు? ఎందుకు మీడియాతో మాట్లాడవద్దని అన్నారు?అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## ఏసిపిని పట్టుకొని ఏడ్చిన వృద్ధురాలు

**పదేళ్ల క్రితం ఘటన గుర్తుకు వచ్చి.."నువ్వే నా దేవుడు"అంటూ..**



హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త : పదేళ్ల క్రితం ఘటన గుర్తుకు వచ్చి కదులుతున్న ఆర్టీసి బస్సులో నుంచి దూకి మరీ మహంకాళి ఏసిపి రవీందర్‌కు దండం పెట్టింది ఓ వృద్ధురాలు. వేగంగా పరిగెత్తుకుంటూ రావడం చూసి బస్సులో ఏమైనా మరిచిపోయి ఉండి బస్సు కోసం పరుగున వెళ్తుంది అనుకున్నారు.. కాని సదరు మహిళ సికింద్రాబాద్ ఆర్పీరోడ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బందోబస్త్ విధుల్లో ఉన్న మహంకాళి ఏసిపి రవీందర్‌ను కలవడానికి తెలుసుకొని ఆశ్చర్య పోయారు. అసలు విషయానికొస్తే..పదేళ్ల క్రితం వృద్ధురాలు కవిత ప్రాణాలు కాపాడారు ఏసిపి రవీందర్. 2014లో టప్పాచభుత్ర ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నప్పుడు కార్వాన్‌కు చెందిన కవిత రోడ్డుపై అనారోగ్యంతో బాధపడుతుంటే తన సొంత డబ్బులతో ఆస్పత్రిలో చేర్పించి ఆపరేషన్ చేయించారు. అనంతరం ఆమే ఏసిపిని కలవడానికి అవకాశం లభించలేదు. అదృష్టవశాత్తు ఆ వృద్ధురాలు సికింద్రాబాద్‌లో బస్సులో వెళ్తుండగా ఏసిపిని గుర్తుపట్టి..బస్సు మధ్యలో దిగి వచ్చి కలిసి సంతోషంతో మునిగిపోయింది. 'ఈ రోజు బ్రతికి ఉన్నానంటే మీరే సార్' అని కన్నీరు పెట్టుకుంది. 'నువ్వే నా దేవుడంటూ' ఏసిపి రవీందర్‌ను పట్టుకొని ఏడ్చింది ఆ వృద్ధురాలు..మానవతా దృక్పదంతో తాను చేసిన సేవను గుర్తుంచుకొని తన వద్దకు వచ్చిన ఆ వృద్ధురాలు కృతజ్ఞతకు ఏసిపితో పాటు అక్కడున్న అందరు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ఏసిపి ఫోన్ నెంబర్ తీసుకోని ఆనందంగా వెళ్లిపోయింది. దీంతో స్థానికులు ఏసిపిని అభినందించారు.

## బిటి రోడ్డు పనులను పరిశీలించిన మేయర్



బండ్లగూడ కార్పోరేషన్‌లోని పిఅండ్‌టీ కాలనీలో వేస్తున్న 60ఫీట్ల బిటి రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఆగస్టు 27 ప్రభాత వార్త : ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కార్పోరేషన్ పరిధి లోని పీఅండ్‌టీ కాలనీలో రూ.10.కోట్ల నిధులతో నూతనంగా వేస్తున్న 60.ఫీట్ల వెడల్పున్న బి.టి.రోడ్డు పనులను కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలో రోడ్లు సవ్యంగా ఉంటాయో ఆ ప్రాంతాలు వ్యాపార, వాణిజ్య,విద్య,వైద్య విభాగాలలో వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి ఆనుకొని ఉన్న బండ్లగూడ కార్పోరేషన్‌ను సైతం రాజధానికి ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నాయకత్వంలో బండ్లగూడను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిషలు కష్టపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డిసిఎల్ డిఇ సత్యనారాయణ, ఏఈ మురళీ కృష్ణ, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హైటెక్స్‌లో నుంచి గచ్చిబౌలి వరకు నిర్వహించిన 5కె రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

## ప్రారంభమైన శ్రీవారి పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి, ఆగస్టు27 ప్రభాతవార్త : చిక్కడపల్లిలోని పవిత్రమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక పవిత్రోత్సవాలు పాంచరాత్రాగమ విధానాలతో అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం దేవదేవుడైన మలయప్పస్వామి తనదేవేరులను ప్రత్యేక ఆసనంపై ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వమించారు. పవిత్రాహ్వానం, స్వస్తివాచనము, రక్షాబంధనము, రుత్వికరణము, అగ్నిప్రతిష్ఠ, హవనము, వేదప్రబంధ పారాయణాలు, ఆరగింపు మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారంగా జరిపించారు. వెంకటేశ్వరస్వామివారికి ప్రతినిత్యం సేవలు, కైంకర్యాలు, ఉత్సవాలు జరుగుతూనే వుంటాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతాశౌచం వంటి సమయాల్లో ఏవైనా తెలిసో.. తెలియకో.. పొరబాట్లు, సిబ్బంది వల్ల తప్పులు దొర్లడం మానవసహజం. ఇలాంటి వాటిని సంపూర్తిగా మన్నించమనీ, ప్రక్షాళనదిశగా, ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు స్వామివారిని వేడుకుంటూ నిర్వహించే కార్యక్రమాన్నే పవిత్రోత్సవాలుగా భావిస్తారు.

## మద్యంపై ఎన్ని ఆంక్షలు విధించినా డ్రంక్ అండ్ డ్రైవ్ మారడం లేదు

తిరుమలగిరి, ఆగస్టు 27 ప్రభాతవార్త: మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని ప్రభుత్వాలు,పోలీసులు నిత్యం చౌరస్తాలపై చెబుతూనే ఉన్నారు. చట్టాలను ముందుగా పాటించాల్సిన వారే దారి తప్పి ప్రమాదాలకు చోటిస్తున్నారు. చట్టాలకు కాపాలా ఉన్న ఓ పోలీస్ అధికారి మద్యం మత్తులో అతీవేగంగా కారునడిపి ఓ వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో కూరగాయల వాహనాన్ని నడిపే డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. వివరాలోకి వెళ్లగా హైదరాబాద్ నగరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈ ఘోరప్రమాదానికి ఒడిగట్టాడు. బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పూర్వపరాలు పరిశీలించి సిఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సిఐ శ్రీనివాస్ మద్యం సేవించి కారు నడపడంతో ఆయను పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా రీడింగ్ 200 దాటినట్లు తెలుస్తుంది. ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## జాతీయ సమగ్రత సమైక్యతకు కళలు తోడ్పడుతాయి

**ఎపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు**




48వ అకిలభారత శాస్త్రీయ సంగీత నృత్యప్రదర్శనలో ఒక దృశ్యం

నాంపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త : నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో వారం రోజులపాటు జాతీయస్థాయిలో జరుగుతున్న అకిలభారత సంగీత నాటక పోటీల రెండవరోజు ఆదివారం జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపి విద్యా నియంత్రణ మండలి అధ్యక్షుడు, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ కళలు జాతీయ సమగ్రతకు, సమైక్యతకు ఎంతగానో తోడ్పడుతాయని అన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు డా. నందూరి విద్యారణ్య స్వామి, నృత్యగురువులు డి.నాగసాయి, బి.కిరణ్మయిలను ఘనంగా సత్కరించి ప్రసంగిస్తూ జాతీయస్థాయిలో జరుగుతున్న ఈ శాస్త్రీయ సంగీత నృత్యపోటీలు మన సాంస్కృతిక రాయబారులైన యువకళాకారులకు స్ఫూర్తిదా యకం, వారిలో పోటీతత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని రేకెత్తిస్తాయన్నారు.

## మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన కేంద్ర మాజీ మంత్రి సర్వే

కంటోన్మెంట్, ఆగస్టు 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ అసెంబ్లీ కాం గ్రెస్ టికెట్ ఆశిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఆదివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఇన్‌ఛార్జి మానిక్ థాక్రే, పిసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిలతో సమావేశమై ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించినందుకు సర్వే సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎల్‌పి.నేత.బట్టి విక్రమార్క, సిడబ్ల్యుసి మెంబర్ దామోదర్ రాజనరి ్సంహా, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శులు శ్రీధర్ బాబు, సంపత్‌లు పాల్గొన్నారు.

## కాస్త.. ఉపశమనం!

**తగ్గుతున్న కూరగాయల ధరలు**



హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: పదిరోజుల క్రితం వరకు వినియోగదారులకు చుక్కలను చూపించిన కూరగాయల ధరలు ఇప్పుడిప్పుడే దిగి వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాన్య ప్రజలకు మొన్నటి వరకు టమాట, పచ్చి మిర్చి ధరలు ఆకాశాన్నంటాయి. అంద రినీ భయపెట్టి దూరమైన టమా టా మళ్లీ వంటింటికి కళ తెచ్చింది. హోల్‌సేల్ మార్కెట్లో రైతు బజార్లలో ధర ఎలా ఉన్నా రూ.100కు 5 కిలోలంటూ అమ్ముతున్నారు. రైతుబజారులో అయితే రూ.15కే దొరుకుతున్నాయి. కిలో టమాట, పచ్చిమిర్చి ధరలు మోల్‌సేల్‌గా రూ.160లు వరకు ఉండగా, రిటైల్‌గా రూ.200 వరకు పలికాయి. మిగతా కూరగాయలను సైతం వ్యాపారులు కిలో రూ.80 నుంచి రూ.120 వరకు అమ్మారు. దీంతో సామాన్య ప్రజలు కూరగాయలు కొనేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో రెండు నెలలుగా టమాట, పచ్చిమిర్చి వాడడమే మానివేశారనే చెప్పవచ్చు. పది రోజుల నుంచి టమాట, పచ్చిమిర్చి ధరలు తగ్గుతూ వస్తుండడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు. రూ.100 దాటిన పచ్చిమిర్చి రైతుబజారులో రూ.30కే అందుబాటులో ఉన్నాయి. ఇక బీన్స్ తప్పించి మిగతా కూరగాయల ధరలన్నీ రైతుబజార్లలో రూ.50లోపే ఉండగా అల్లం, వెల్లుల్లి ధరలు మాత్రం తగ్గలేదు. ఉల్లిగడ్డ కూడా వేసవిలో పోల్చితే కిలోకు రూ.5 పెరిగి రూ.30కి దొరుకుతోంది. కూరగాయల రాక సమృద్ధిగా ఉండడంతో బయట సూపర్ మార్కెట్లలో కూడా రైతుబజారు కంటే రూ.10 నుంచి రూ.20ఎక్కువకే అమ్ముతున్నారు.

**దిగుమతి పెరగడంతో..** వేసవిలో కురిసిన అకాల వర్షాల కారణంగా చిత్తూరు జిల్లా మదనపల్లి, అనంతపురం, కర్నాటక రాష్ట్రంలో టమాట పచ్చిమిర్చి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తోటలు దెబ్బతిని దిగుమతి లేని కారణంగా టమాట, పచ్చిమిర్చి ధరలు ఆకాశాన్నంటాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. టమాట, పచ్చిమిర్చి తోటలకు రైతులు కాపలా ఉన్న చరిత్ర కూడా ఉంది. ఎస్కార్ట్‌ను పెట్టుకుని టమాట రవాణా చేసిన సంఘట నలు ఉన్నాయి. ప్రస్తుతం దిగుమతి పెరగడంతో ధరలు తగ్గుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లకు కూరగాయలు భారీగా వస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకూ హోల్‌సేల్ మార్కెట్‌లకు 18-21 వేల క్వింటాళ్ల కూరగాయలు వస్తే ప్రస్తుతం 35 వేలకు పైగా క్వింటాళ్లు వస్తున్నాయి. టమాట 3వేల క్వింటాళ్లు వస్తున్నాయి. వర్షాలు కాస్త ఊరటనిర్వడంతో ఆకుకూరలు కూడా భారీగా వస్తున్నాయి.

## పాతబస్తీలో మెట్రో పనుల కోసం డ్రోన్ సర్వే



హైదరాబాద్ ఆగస్టు 27 ప్రభాతవార్త : పాతబస్తీ మెట్రో పనుల కోసం డ్రోన్ సర్వేను హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు చేపట్టారు. పాతబస్తీలో మెట్రో అలైన్‌మెంట్, ప్రభావిత ఆస్తులపై డ్రోన్ సర్వేను నిర్వహించారు. ఇరుకైన మార్గంలో ప్రభావిత ఆస్తుల కచ్చితమైన కొలతలు తీసుకోవడానికి ఈ సర్వే చేశామని మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. సాంప్రదాయిక సర్వేతో పాటు దారుల్-షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్‌ల మధ్య ఇరుకైన మార్గంలో రహదారి విస్తరణ, మెట్రో స్టేషన్‌ల నిర్మాణానికి అవసరమైన ప్రభావిత ఆస్తులకు సంబంధించిన ఖచ్చితమైన కొలతలు తీసుకోవడానికి డ్రోన్ సర్వే కోసం ఈ సర్వే ప్రారంభించినట్లు ఎన్వీఎస్‌రెడ్డి వివరించారు. 21 మసీదులు, 12 దేవాలయలు, 12 అషూర్ ఖానాలు, 33 దర్గాలు, 7 సమాధి యార్డులు, 6 చిల్లాలతో సహ దాదాపు 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలను రక్షించడానికి తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలను రూపొందించడంలో డ్రోన్ సర్వే సహాయపడుతుంది. మెట్రో అలైన్‌మెంట్, పిల్లర్ లోకేషన్‌లు తదితర వాటిని ఈ మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపని విధంగా ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు. డ్రోన్ సర్వే ద్వారా రియల్ టైమ్ డేటా, హై రిజల్యూషన్, ఇమాజినరీ, 3డీ మోడలింగ్, జిఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) డేటా, సిఏడి సాఫ్ట్‌వేర్ అతుకుల ఏకీకరణ, డేటా విశ్లేషణ, విజువలైజేషన్‌ను త్వరితగతిన సేకరించవచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో రాబోయే కొద్దిరోజుల్లో మట్టి పరిశోధన ప్రారంభించడానికి టెండర్లు కూడా ఖరారు చేయబోతున్నారు. ఫలక్‌నుమా మెట్రోస్టేషన్ ఉన్న చివరి స్టేషన్ నుంచి భూసార పరిశోధన ప్రారంభమవుతుందని. ఇప్పటికే ఉన్న స్టేషన్‌గా ఉన్న ఎంజిబిఎస్ కాకుండా, పాత నగరంలోని 5.5 కిలోమీటర్ల మెట్రో మార్గంలో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ (మెట్రో స్టేషన్‌లు, ఈ రెండు స్మారక చిహ్నాలకు 500 మీటర్ల దూరంలో ఉంటాయి), శాలిబండ, ఫలక్‌నుమ అనే నాలుగు మెట్రో స్టేషన్‌లు కలిగి ఉంటాయి.

## జంగమ కులస్తులను సంచార జాతుల్లో కలిపే అంశంపై సిఎంతో చర్చిస్తా

**జహీరాబాద్ లోకసభ సభ్యుడు బి.బి.పాటిల్**



నూతనంగా ఎన్నికైన జంగమ సమాజం గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమానికి సిఎం కెసిఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జహీరాబాద్ లోకసభ సభ్యుడు బి.బి.పాటిల్ అన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని జంగమ కులస్తులు ప్రస్తుతం ఎంబిసీ గ్రూప్‌లో ఉన్నారని, వారందరిని సంచార జాతుల్లో కలపే అంశంపై ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చిస్తానని అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ జంగమ సమాజం గ్రేటర్ హైదరాబాద్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ సభ నూతన అధ్యక్షుడు జె.భద్రేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ జంగమ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, జంగమ సమాజం ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు వి.నాగభూషణం, కోశాధికారి జి.జగదీశ్వర్, దక్షిణమధ్యరైల్వే జెడ్‌ఆర్‌యుసిసి సభ్యుడు డి.కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధన కోసం మహిళా లోకం శక్తినంతా కూడదీసి పోరాడాలి

**రెగ్యులరైజ్ అయ్యేంత వరకు ఎఎన్ఎంలు ఉద్యమించాలి**

**జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా పిలుపు**




ఎఎన్ఎంల సదస్సులో ప్రసంగిస్తున్న అనీరాజా

సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: తమ హక్కులు సాధన కోసం మహిళలు శక్తినంతా కూడదీసి పోరాడాలని జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా పిలుపునిచ్చారు. తెలంగాణ రెండోవ ఎఎన్ఎంల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏఐటియుసి భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి 77 సంవత్సరాలు అయినప్పటికి దేశంలో మహిళలు ఇంకా అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలను రెండోవ ఎఎన్ఎంలుగా పిలవడం ఏమిటని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. వివక్ష అనేది ప్రారంభంలోనే మొదలైందని ఆది రూపుమాసిపోయేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. భయపడుతూ పోరాడితే ఏది సాధించలేమని, తెగించి పోరాడితేనే హక్కులు సాధించుకోగలమనా న్నరు. పోరాటాలను అణిచివేయడానికి ప్రభుత్వాలు ఎప్పుడు ముందుంటాయని, ఆ అణిచివేతను దాటుకుని ముందుకు వెళితేనే విజయం వరిస్తుందని స్పష్టం చేశారు. రెండోవ ఎఎన్ఎంలు రెగ్యులర్ అయ్యేంతవరకు పోరాడాలని ఆ పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఎఐటియుసి జాతీయ నాయకురాలు డా.బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ 103 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎఐటియుసి ఎన్నో పోరాటాలు చేసి విజయాలను సాధించిందని, ఈ జెండా నీడలో పోరాడుతున్న ఎఎన్ఎంలకు విజయం తథ్యమన్నారు. ఎఐటియుసిరాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ గత 12 రోజులుగా వేలాది మంది ఎఎన్ఎంలు నిరవధికంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని నిశితంగా విమర్శించారు. ఈ సదస్సులో రాష్ట్ర నాయకుడు తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండోవ ఎఎన్ఎంల సంఘం ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, అర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ విజయానికి యువత కృషి చేయాలి

**కాలేరు వెంకటేష్ పిలుపు.. పార్టీలో చేరిన 300 మంది యువత**



యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆనేక మంది నాయకులు, యువత బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. ఆదివారం నాడిక్కడ ఎమ్మెల్యే కార్యాలయంలో అంబర్‌పేట డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు సాయిబాబు, శ్రీకాంత్, ప్రవీణ్, ఆషు, సాయియాదవ్ బృందం నాయకులు కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, సిద్ధార్థముదిరాజ్ ఆధ్వర్యంలో 300 మంది యువత బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమె ్మల్యే గులాబి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కాలేరు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నిరుపేదల కోసం ఆనేక సంక్షేమ పథకాలను చేపట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి ప్రచారం చేయాలని, కష్టపడేవారికి ప్రతి స్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. కెసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా ఉన్నాయన్నారు.

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించిందని, దేశంలోనే నెంబరు వన్ రాష్ట్రంగా ఎదిగిందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కెసిఆర్ చిరునామాగా మార్చారని కొనియాడారు. పార్టీ లో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపించాలని వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

## యాదవ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి తలసాని



1వ వార్డు బోయిన్‌పల్లిలో రూ.30 లక్షల వ్యయంతో యాదవ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి,జక్కుల మహేశ్వర్ రెడ్డి

అడ్డగుట్ట, ఆగస్టు 27 ప్రభాతవార్త: యాదవ్‌ల సంక్షేమం కోసం, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అదివారం కంటోన్మెంట్ 1వ వార్డు నేతాజీ నగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌ను బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, అభ్యర్థి లాస్య నందిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మర్రి రాజశేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ యాదవ్‌ల ఐకమత్యంతో కలిసి ఉండాలన్నారు. నగరంలో శ్రీ క్రిష్ణాష్టమి వేడుకలు, దసరా ఉత్సవాలు, మహంకాళి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, శ్యామ్ కుమార్, నళిని కిరణ్, అనితా ప్రభాకర్, లోకనాథం, యాదవ సంఘం నేతలు తుమ్మల మల్లేశ్‌యాదవ్, అరుణ్ యాదవ్, రాములు యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, వెంకటేశ్‌యాదవ్, సంతోష్ యాదవ్, దయానంద్ యాదవ్, బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్ ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు

**జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాధ్**



జవహర్ నగర్‌లో శ్రీసీతారామంజనేయ కాశీ విశ్వేశ్వర భూనీల సమేత వెంకటేశ్వర పోచమ్మ దేవాలయ నూతన కమిటి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాధ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 27, ప్రభాతవార్త : నియోజకవర్గం పరిధిలోని ఆలయాల అభివృద్ధికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జూబ్లి హిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపి నాధ్ అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో శ్రీ సీతారామాంజనేయ కాశీ విశ్వేశ్వర భూనీల సమేత వెంకటేశ్వర పోచమ్మ దేవాలయం నూతన కమిటి ప్రమాణ స్వీకారోత్సవంలో స్థానిక కార్పోరేటర్ దేదిప్యరావుతో కలిసి,ఆయన పాల్గొన్నారు.ఆలయ చైర్మన్‌గా జి.లక్ష్మణ్, అధ్యక్షులుగా శ్రీనువాసులు, వైస్ చైర్మన్‌గా కె.యాదగిరి, ఉపాధ్యక్షులుగా పి.రామకృష్ణ, అర్జున్, అశోక్ యాదవ్, సందీప్‌యాదవ్, హేమలత రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.నందు, కోశాధికారిగా ఎన్ దామోదర్, జాయింట్ సెక్రటరీలుగా భానుగౌడ్, జీవన్ కుమార్, విశాల్ రాజ్, రాఘవేంద్ర, అరుణ్‌కుమార్, వినోద్‌కుమార్, ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్ రాజు, చక్రధర్, లక్ష్మి, సాయిగౌడ్, కమిటి సభ్యులుగా శ్రీశైలం, సంజీవ్, శివశంకర్, విజయ్‌కుమార్, కృష్ణ, పవన్, మహేష్, సంపత్‌కుమార్, శ్రీహరి, కళ్యాణ్ యాదవ్, వెంకట్ చిన్న, వంశీ, రాహుల్, తదితరులను నియమించారు.

## ఫుట్‌ఫాత్‌పై గుర్తు తెలియని మహిళ మృతి



బేగంపేట ఆగస్టు 27,ప్రభాతవార్త : గుర్తు తెలియని మహిళ ఫుట్‌ఫాత్ పై మృతి చెందిన ఘటన రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాంగోపాల్‌పేట పీజీ రోడ్డు పార్శి ధరమాల బిల్డింగ్ ముందు ఫుట్‌ఫాత్‌పై ఓల్డ్ బోయిన్ పల్లికి చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి, 26వతేదీన 10గంటల సమయంలో ఒక మహిళ ఫుట్‌ఫాత్‌పై పడిపోయి ఉండటాన్ని గమనించి రాంగోపాల్‌పేట పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా స్థానికంగా ఉన్న వారు ఆమెను గుర్తించలేదన్నారు. మృతురాలు సుమారు 5.2అడుగుల ఎత్తు ఉంటుందని, వయసు సుమారు 50సంవత్సరాలు ఉంటాయని,వెంట్రుకలు నలుపు రంగులో ఉన్నాయని, యాష్ కలర్ చుడీదార్, పింక్ కలర్ పైజమా వేసుకుందని, ఎడమ చేతిపై టాటూ ఉందని,మృతురాలి ఆచూకి తెల్సిన వారు రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ ను సంప్రదించాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని,ఎస్సై అశోక్ తెలియజేసారు.

### సిటీ కళాశాల బస్టాప్ వద్ద
## గుర్తు తెలియని మృతదేహం



యాకుత్‌పుర,ఆగష్టు 27 ప్రభాతవార్త : పాతబస్తీ ప్రభుత్వ సిటీ కళాశాల బస్టాప్ వద్ద గుర్తు తెలియని పడిఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిటీ కళాశాల చౌరస్తా వద్ద గుర్తు తెలియని 35 సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృత దేహం పడి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు గుర్తు తెలియని ఆ వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.మృతుని దేహంపై నలుపు రంగు ఫ్యాంటు,షర్టు ఉన్నాయి. చని పోయిన వ్యక్తికి సంబంధించిన వారు 8712660335 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలి.ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కన్నుల పండువగా ఆలయ వార్షికోత్సవం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

జీడిమెట్ల, ఆగస్టు 27 ప్రభాతవార్త : గాజులరామారం డివిజన్ పరిధి ఆదర్శనగర్‌లోని శ్రీశ్రీశ్రీపోచమ్మ అమ్మవారి ఆలయం 13వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈవేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ఆలయకమిటి అధ్యక్షులు ఎస్‌విఎన్‌చర్య, శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్, నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు మెంబర్‌ను కలిసిన కార్పొరేటర్ రోజాదేవి



కూకట్‌పల్లి, ఆగస్ట్ 27, ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన గడ్డం సీతా రంజిత్‌రెడ్డిని పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్‌రెడ్డిని వారి నివాసం వద్ద వివేకానందనగర్ డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. టిటిడి బోర్డు చైర్మన్‌తో పాటు మెంబర్లుగా నియమితులైన ప్రతి ఒక్కరు టిటిడి బోర్డు చైర్మన్‌తో పాటు మెంబర్లుగా నియమితులైన ప్రతి ఒక్కరూ తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావు శుభాకాంక్షలు తెలిపారు.

## మన్ కీ బాత్‌లో ప్రధాని ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలి



మన కీ బాత్ కార్యక్రమాన్ని అలకిస్తున్న బిజెపి నాయకులు

హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారం హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోలింగ్ బూత్‌లలో అలకించడం జరిగింది. ఆమెతోపాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు, వివిధ బస్తీల ప్రజలు ఈ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీరామన్‌గౌడ్ మాట్లాడుతూ మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చేందుకు అందరూ ప్రయత్నించాలని కోరారు.

## ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహా సభను విజయవంతం చేయాలి : సామ్యేల్ మాదిగ

కంటోన్మెంట్, ఆగస్టు 27 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ చేపట్టనున్న మాదిగల విశ్వరూప మహా సభను విజయవంతం చేసేందుకు మాదిగ జాతి ఉప కులాలన్నీ ఏకం కావాలని సికింద్రాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మంథని సామ్యేల్ మాదిగ తెలిపారు. ఆదివారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

## ఎన్నికల కోసమే బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు

### ముంబాయి పర్లే ఎమ్మెల్యే పరాగ్ అల్వాని



ఎమ్మెల్యే ప్రవాస్ యోజన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరాగ్ అల్వాని

మెట్టుగూడ, ఆగస్టు 27 ప్రభాతవార్త: ఎన్నికల కోసమే బీఆర్ఎస్ సం క్షేమ పథకాలను తీసుకొ స్తుందని ముంబాయి పర్లే ఎమ్మెల్యే పరాగ్ అల్వాని ఎద్దేవ చేశారు. సికింద్రాబాద్ నియోజక వర్గం బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాసయోజన విస్తృత స్థాయి సమావేశం ఆదివారం మర్రికృష్ణారెడ్డి హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ముంబాయి పర్లే ఎమ్మెల్యే పరాగ్ అల్వాని హాజరయ్యారు. నియోజక వర్గం ముఖ్యనాయకులతో సమావేశం అయి రానున్న ఎన్నికల కోసం చేయవలసిన దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరాగ్ అల్వాని మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజక వర్గంలో తాము 5డివజన్లలో తిరిగామని ఎక్కడ చూసినా డ్రైనేజీ, కలుషిత నీటి సమస్య ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం కారులను సీఎం కేసీఆర్ విస్మరించారని ఉద్యమకారులను లాఠిలతో కొట్టించిన వారిని అందెలమెక్కించారని ఆరోపించారు. ఉద్యమంలో ఉన్నవ వారికి పదవులు దక్కలేదన్నారు.ఈ కార్యక్రమంలో బిజేపీ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదం విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు బండపల్లి సతీష్ గౌడ్, ప్రభుగుప్త, ఓబీసీ ప్రధాన కార్యదర్శి సుక్కగణేష్ ముదిరాజ్, పోచయ్య యాదవ్, హరి, వీరన్న, ప్రకాష్ గౌడ్, ఉపేందర్ యాదవ్, గర్షమోహన్, శంకర్, శ్రావణ్, జమ్మికుంట వేణు, కృష్ణమూర్తి, టెంపుల్ సాయి, చరణ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్ చారి, ప్రమోద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమాజంలో ప్రతివ్యక్తి భక్తి మార్గంలో నడవాలి



దక్షిణ మండలం శాంతి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు టిప్పు సోనీ కావడి యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

చార్మినార్, ఆగష్టు 27 ప్రభాతవార్త : సమాజంలోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని దక్షిణ మండలం శాంతి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు టిప్పు సోనీ అన్నారు. మేఢ్ క్షత్రియ్ స్వర్ణకార్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పాతబస్తీలో నిర్వహించిన కావడి యాత్రను ఆయన మదన్ భవన్ వద్ద ప్రారంభించారు. చార్‌కమాన్, బహదూర్‌పుర, దేవిబాగ్, అత్తాపూర్‌తోపాటు పలు ప్రధాన రహదారులలో వేధికలను ఏర్పాటు చేసి ప్రజలు కావడి యాత్రకు స్వాగతం పలికారు. మదన్ భవన్ నుంచి యాత్ర ప్రారంభమై నార్సింగ్‌లోని శ్రీ మఛలేశ్వర మహాదేవ్ మందిరం వరకు కొనసాగింది.వందలాది మంది భక్తులు కావడీలను భుజాలపై మోసుకుంటూ హరహర మహాదేవ్ అని నినాదాలు చేస్తూ కావడి యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేఢ్ క్షత్రియ్ స్వర్ణకార్ సమాజ్ ప్రతినిధులు టిప్పు సోనీ,విష్ణు సోనీ,మాజీ కార్పొరేటర్ రేణు సోనీ,గౌరీ శంకర్ సోనీ,మహేంద్ర కుమార్ కడేల్,శ్రీ రామ్ సునాలియా,విష్ణు ఝింగ్,రాజేష్ ఖిప్పల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ది చెప్తారు

### గజ్జల యోగానంద్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 27, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరడం ఖాయం అని శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గజ్జల యోగానంద్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పాద యాత్రలో భాగంగా 65వ రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్, ఆర్‌పి కాలనీలో గజ్జల యోగానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమవుతూ ప్రజల సాధక బాధలు తెలుసుకుంటూ ప్రతి గడపకు వెళ్ళి ప్రజలు పడుతున్న ఇబ్బం దులను అడిగి యోగానంద్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని, ప్రజలు ఇన్ని సమస్యలతో సతమతమవుతున్న ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే అధిక పన్నులు ఇస్తున్నటువంటి శేరిలింగంపల్లి నియోజకవర్గం యొక్క అభివృద్ధి అట్టడుగు స్థాయిలో ఉందని యోగానంద్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నర్సింగ్ రావు, విద్యాకల్పన, ఏకాంతగౌడ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

### ఎమ్మెల్సీ సంకనూర్



బిజెపి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కర్నాటక ఎమ్మెల్సీ సంకనూర్ బిజెపి నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, సుస్మిత,రజనీ రెడ్డి

కంటోన్మెంట్, ఆగస్టు 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలపై బిఆర్ఎస్ ప్రభుత్వం సవతి తల్లిప్రేమ చూపుతుందని, అభివృద్ధికి ఒక్కరూపాయి కూడా ఖర్చుపెట్టలేదని కర్నాటక దార్‌వాడ్ఎమ్మెల్సీ సంకనూర్ ఆరోపించారు. ఆదివారం 5వ వార్డు వాసవి నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కంటోన్మెంట్ బిజెపి వినస్తబ్యుత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ బోర్డు నామినెట్ మెంబర్ రామక్రిష్ణ చొరవతోనే కంటోన్మెంట్‌కు రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సిన టీపిటి బకాయిలు వచ్చాయన్నారు. ఉచిత మంచినీటి పథకం అమలుపై కోర్టును ఆశ్రయిస్తేనే వచ్చాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని గెలిపిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి బి.ఎస్.శ్రీనివాస్, నాయకులు సుస్మిత శంకర్‌రావ్, రజనీ రెడ్డి, పరశరామ్, విజయానంద్, సతీష్, మన్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపుకోసం కృషి చేయండి సమస్యలను పరిష్కరిస్తా

### బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



నాచారం గొల్లముత్యాలు బావి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన బండారి లక్ష్మారెడ్డి

నాచారం, ఆగస్టు 27 ప్రభాతవార్త: తనను గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానని బీఆఎర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాచారం గొల్ల ముత్యాలు బావి వెల్ఫేర్ అసోసియేషన్, అన్నపూర్ణ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులతో బిఎల్ఆర్ మర్యాదపూర్వకంగా కలిసి వారిని మద్దతు పలుకాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా అభ్యర్థి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను నిత్యం ప్రజల్లో ఉంటూ ఎలాంటి సమస్యలు వచ్చినా నేను ఉన్నానని వెల్లి వారికి బాసటగా నిలిచానన్నారు. తన గెలుపుకోసం కాలనీ అసోసియేషన్లు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎలాంటి సమస్యలున్నా తాను పరిష్కరిస్తామని హామినిచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బిఎల్ఆర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్, టీఆర్ఎస్ నాయకులు. కొమురెల్లి మల్లన్న దేవస్థానం పాలక మండలి సభ్యులు ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్, కాలనీ అధ్యక్షులు నరసింహ్మా యాదవ్, ప్రధాన కార్యదర్శి విఠల్ యాదవ్, ఉపాధ్యక్షుడు రాజబోయిన బిక్షపతి యాదవ్, కోశాదికారి కైలాస్ పటేల్, స్థానిక నాయకులు శ్రీనివాస్ యాదవ్, సంపత్ యాదవ్, శేఖర్ యాదవ్, నరసింహ్మా యాదవ్, టీఆర్ఎస్ కేవీ నారాయణ పటేల్ రవీందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, మల్లేష్, రామకృష్ణ యాదవ్, పెంటయ్య, తరుణ్, పాండు నాయక్, శ్రీనివాస్,పింఛన్ సోమయ్య, ప్రభాకర్, నరేష్, అంజయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా సతీష్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త: చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్.సతీష్‌కుమార్ నియమితులయ్యారు. షాద్‌నగర్ ఫారూక్‌నగర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆయన అశోక్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎండి.హమీద్ సదాశివపేటకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సతీష్‌కుమార్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యాలయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా భూముల రిజిస్ట్రేషన్ నిర్వహించి, ప్రభుత్వ ఆదా యాన్ని పెంచుతామన్నారు. ఈ సందర్భంగా నూతన సబ్‌రిజిస్ట్రార్‌ను సిబ్బంది అభినందించారు.



రత్నానగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత కె.మురళీకృష్ణ

## సిఎం కెసిఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాను సవరించాలి

### తెలంగాణ బిసి జాగృతి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీకృష్ణ

హైదరాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త : సిఎం కెసిఆర్ ప్రకటించిన బిఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను సవరించి..అంబర్‌పేట నియోజకవర్గం టికెట్ తనకు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ బిసి జాగృతి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీకృష్ణ అన్నారు.పార్టీ కోసం ఎంతో కృషి చేస్తున్నానని, తనకు టికెట్ కేటాయిస్తే నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అండదండలతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పార్లమెంటు, శాసనసభ, జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం తనవంతు పాత్ర పోషించానని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తుతున్నానని పేర్కొన్నారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అంబర్‌పేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి కెసిఆర్ పాలనవిజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు లాలయ్యగౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గల్బవీధిలో భారీ గణనాధుని విగ్రహం ప్రతిష్టాపన



చార్మినార్,ఆగష్టు 27 ప్రభాతవార్త : శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాతబస్తీ పురానాపూల్ గల్బవీధిలో ఆదివారం 26 అడుగుల ఎత్తు గల భారీ గణనాధుని విగ్రహాన్ని ప్రతిష్టించారు.ప్రతీ సంవత్సరం గల్బవీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయి.ఈ నేపథ్యంలోనే మూడు వారాలు ముందుగానే గల్బవీధి యూత్ అసోసియేషన్, జివైఎ జట్టుల ఆధ్వర్యంలో ఎంతో సుందరమైన భారీ వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్టించారు.మండపం ప్రతినిధులు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా వైద్యుల అడుగులు

సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: వైద్య రంగంలో రోజు, రోజుకు వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా వైద్యులు కూడా అడుగులు వేస్తున్నారని కొత్త, కొత్త ప్రయోగాలు చేస్తున్నారని పలువురు సీనియర్ డాక్టర్లు చెప్పారు. కింగ్ కోఠిలోని కామినేని ఆసుపత్రిలో ఆదివారం కామినేని, జెమ్ కేర్ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఐసియూలో అత్యవసర సమయంలో రోగి ప్రాణాలు ఏలా కాపాడాలి' అనే అంశంపై యువ వైద్యులకు జరిగిన వర్క్‌షాపులో డాక్టర్లు ప్రసంగించారు. నగరంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన వంద మంది యువ వైద్యులు ఈ వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఐసియూలో రెండు దశాబ్ధాలకుపైగా అనుభవం ఉన్న సీనియర్ వైద్యులు పాల్గొన్న ఈ వర్క్‌షాపులో యువ వైదులకు పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. వర్క్‌షాప్‌లో జెమ్ కేర్ గ్రూప్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రవిపాటి, కామినేని హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య, కామినేని మెడికల కాలేజీ హెచ్‌ఓడి డాక్టర్ సాయి, డాక్టర్ రాకేష్, గురప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి.

సైఫాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న మాధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల డిమాండ్లలను వెంటనే అమలు చేయాలని జాతీయ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు డా.బి.వి.విజయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలో సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది పిల్లలకు వర్కర్స్ ఆహారాన్ని అందిస్తూ విశేషమైన సేవలు అందిస్తున్నారని, వారికి శ్రమ ఉన్నప్పటికి పిల్లల మీద ప్రేమతో విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమా వేశంలో యూనియన్ నాయకులు పూసాల రమేష్, జంపాల రవీందర్, చక్రపాణి, ధశరథం, ముంతాజ్‌బేగం, ప్రమీల, వసంత నాగలక్ష్మి, సాయమ్మ, సత్తయ్య, రాంమోహన్ పాల్గొన్నారు.

## గుండెల్లో పెట్టుకుని చూసుకునే నాయకుడు పవన్ కల్యాణ్



ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయ చెక్కును అందజేస్తున్న జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్‌గౌడ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 27, ప్రభాతవార్త : నాయకులకు కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసే నాయకుడు పవన్ కళ్యాణ్ అనీ తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్‌గౌడ్ అన్నారు. ఇటీవల అదిలాబాద్ జిల్లా నిర్మల్ నియోజకవర్గంలో క్రియాశీలక జనసేన కార్యకర్త ప్రమాదంలో ఎమ్.నవీన్ మరణించాడు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ రూ.5లక్షల చెక్కును జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని ఎపార్టీ కార్యలయంలో మృతుడు నవీన్ కుటుంబానికి చెక్కును రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం చేతుల మీదుగా అందజేశారు. నవీన్‌ను సభ్యత్వం చేయించిన వాలంటీర్ శ్రీరామ్ శ్రీనువాస్‌ల సమక్షంలో నవీన్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సురేష్, సతీష్, రాజేష్, రమావత్ రవి, రవిందర్, రూపేందర్, నవీన్, సురేష్, తరుణ్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

నిజాంపేట, ఆగస్టు 27 ప్రభాతవార్త : ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే కబ్జాల పర్వం కొనసాగుతుంది. రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపడుతూ అమాయకులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమణలపై అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, సాయినగర్‌లోని సర్వేనంబర్ 186లో గల ప్రభుత్వ స్థలంలో కొంతకాలంగా ఆక్రమణలు ఊపందుకున్నాయి. కొందరూ అక్రమార్కులు ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. సదరు స్థలంలో రాత్రిపూట నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో పదుల సంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. ఒక్కో ప్లాటును లక్షల రూపాయలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుపుతున్నారు. మియాపూర్-గండిమైసమ్మ రహాదారి నుండి సాయినగర్ మీదుగా నిజాంపేటకు వెళ్ళే లింకు రోడ్డు పక్కన కబ్జాల పర్వం నడుస్తుంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు పాల్పడుతున్న రెవిన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇప్పటికై ఉన్నతాధికారులకు స్పందించి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

## 45 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం తయారీ



ఎల్.బి.నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త: 45 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి యువకులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎటువంటి కెమికల్స్ వాడకుండా కాలుష్యాన్ని అధిగమిస్తూ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పది సంవత్సరాలుగా భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆ మహా గణనాథుడి దర్శనం కోసం వేలాదిగా తరలివస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట డివిజన్లోని బాలాజీ నగర్ కాలనీలో తిరంగా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం శ్రీలక్ష్మి, సరస్వతి సహిత వేంకటేశ్వర, మహాగణపతి రూపంతో తిరంగా యూత్ అసోసియేషన్ 17వ వార్షికోత్సవం సందర్భంగా భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 36, 41 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఈ సంవత్సరం 45 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ కలుష్య నివారణలో తమ వంతు బాద్యత నిర్వహిస్తున్నారు. కొత్తకోట ప్రాంతానికి చెందిన ప్రముఖ కళాకారుడు నగేష్ నేతృత్వంలో విగ్రహ తయారీ కార్యక్రమం జరుగుతుంది. తొమ్మిది రోజులపాటు నిత్య పూజలు అందుకునే గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు కూడా భారీగా తరలివస్తారు. నిమజ్జనం తరువాత విగ్రహానికి వాడిన మట్టిని చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు తీసుకెళ్ళి వారి పెరట్లో, పంటపొ లాల్లో వేసుకుంటారని, మిగిలిన గడ్డి ఇతర వస్తువుల ని లారీలో తీసుకెళ్ళి నదిలో నిమజ్జనం చేస్తారు. తిరంగా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్న బోయిన సాయి ముదిరాజ్, బడ్కొ రమేష్, హంచతే శ్రీవాస్తవ్, గుండుమల్ల ప్రవీణ్ గౌడ్, సోని రోహిత్, యిప్ప వెంకటేష్ తదితరులు నెలరోజుల పాటు ప్రత్యేక శ్రద్ధ వహించి విగ్రహాన్ని తయారు చేయించడంతో పాటు నవరాత్రులు పూర్తయిన తర్వాత నిమజ్జనం కూడా ప్రశాంత వాతావరణంలో చేయించి అందరి మన్ననలు పొందుతున్నారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client **SHAHIDA NIZAMI** D/o Syed Yousuf Nizami, aged 70 years, H.No. 1-5-369, Musheerabad, Hyderabad (Aadhar No.4082 8567 6893), she claiming that she is the absolute owner and possessor of the Open Plot No. 250 in the sub divisions comprising in survey No's 530, 533, 524, 525, 531 532, 540, 541, 542, 547, 537, 538, 529 & 539, admeasuring 311 Sq.Yards situated at Nadergul Village, Hayat Nagar Taluk, Ranga Reddy District having purchased the same from K.Anji Reddy and others through Regd Sale deed Document No. 6325 Of 1984, dated 11.06.1984, Registered at SRO, Hayath Nagar. My client further informed me that while traveling from her Residence Musheerabad to Charminar, she lost the Original Sale Deed Document No. 6325 Of 1984, dated 11.06.1984, Registered at SRO, Hayat Nagar, Ranga Reddy District pertaining to the above plot and she has searched all possible places but her efforts are put in vain.

If any person/s found or trace the above original document, kindly return to my client or my office at below mentioned address and if any person/s misuse the said document same shall be treated as null and void and liable to prosecute as per the law and also liable for all the costs and consequences arising thereof.

**CH. MOHAN, B.A, LLM,**
Advocate,
Flat No.702, "C" Block,
TNR Sulakshana Apartments,
Laxmi Narasimhapuram
Sagar Road, Hastinapuram,
Hyderabad-500079.
**Cell:9000 5000 33.**

**IN THE COURT OF THE HON'BLE IV ADDL SENIOR CIVIL JUDGE:RANGA REDDY DISTRICT:: AT : L B NAGAR . OS NO.466 OF 2008.**

BETWEEN;
SYED SHAH ATHAR MOHIUDDIN QUADRI.
**.....PLAINTIFF**
**AND**
SYED SAIFUDDIN QUADRI AND OTHERS.
**.... DEFENDANTS**

To,
OSMAN BIN ABDULLAH S/O LATE ABDULLAH BIN TAHER. AGED ABOUT 40 YEARS, OCC: GOVT EMPLOYEE , R/O. H.NO.18-12-419/68, HAFEZ BABA NAGAR, HYDERABAD.
**.. DEFENDANT No 21**

Please take notice that the plaintiff filed above suit vide O.S.NO 466 of 2008 against you i.e defendant no 21 and other defendants herein. The said suit is posted on 05-09-2023 for your appearance. Therefore you should be present in person or through advocate on the aforesaid date at 10:30A.M. Otherwise you will be set exparte on the said day, the suit will be decided on merits.

**BY ORDER OF THE COURT.**
**T.NAGIREDDY,**
**SWARNALATA**
ADVOCATES,
H.NO 3-142/3/9, PLOT NO 166
SOUTH PART ROAD NO6,
SEVEN HILLS COLONY,
NANDHI HILLS ,
BALAPUR MANDAL
HYDERABAD-500097
**9392040211, 8790743756**

**PUBLIC NOTICE**

This ti to notify the general public at large that, our clients have negotiated and entered into an agreement to sale for purchasing the below mentioned schedule property for a valuable consideration and have also paid substantial sum as advance on the representation of the **VENDOR SRI.S.VENKATA RAMANA RAO,** S/o.Late S.Veera Raghavalu, Aged about 60 years, Occ:Business, R/o. H.No.26-75, Chanakyapuri, Safilguda, Malkajgiri, Telangana, reprsention that the scheduled property is his sole and absolute property free from all encumbrances and charges. The general public is hereby notified that, if any person or body corporate is having any right, claim, interest or charge over the scheduled property or has any objection for the said sale transaction, then in that event they shall lodge his or her or their claim with the undersigned together with all the relevant documents in respect of their claim within SEVEN days from the date of publication of this notice otherwise our clients shall proceed with the sale transaction holding that there are no-objection/s from any one or any quarter and any objection raised thereafter shall be deemed to have been waived and shall not be entertained nor bind our client.

**SCHEDULE PORPERTY**

All that part and parcel of the Open Plot bearing No.583, situated in Sy.Nos.234/2 to 234/6, situated within the village limits of jalpally, (formerly in Hyderabad East Taluka), Under Jalapally Munici pality, Ranga Reddy District, in the Layout formed by M/s. Indira Gandhi Co-Op Housing Society Limited, Jalpally Village, Jalapally Municipality, Ranga Reddy District and bounded by: **NORTH:** Plot No.622, **EAST:** Plot Nol.582, **SOUTH:** Public Road, **WEST:** Plot No.584. Hence this Caution Notice is issued to the general public at large.

**Sd/-M/s.DAFTARI & DAFTARI,**
**by Mahaveer Kumar Daftari,**
Advocates,
MCH No.3-3-53/8/B,
Ground Floor, Kachiguda Station
Road, Hyderabad-27

# ఉప్పల్ పారిశ్రామికవాడలో అక్రమ పార్కింగ్ దందా..!

## రూ.లక్షల్లో వ్యాపారం.. ప్రభుత్వ ఖజనాకు ఎగనామం



ఉప్పల్ మాడ్రన్ వద్ద పారిశ్రామికవాడలో అక్రమంగా పార్కింగ్ దందా దృశ్యం

**ఉప్పల్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ పారిశ్రామికవాడలో ప్రభుత్వ అనుమతి లేకుండా యథేచ్ఛగా అక్రమ పార్కింగ్ దందా నడుస్తోంది. ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం ఎగనామంపెడుతూ కొందరు వ్యాపారులు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా నడుస్తున్న ఈ వ్యాపారంలో కొందరు బడా నేతలతోపాటు, ఐలా అధికారులు, పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ చౌరస్తాలో గత దశాబ్దాల క్రితంనుంచి పంజా బావివద్ద లారీల అడ్డా ఉండేది. అప్పట్లో రెవెన్యూ అధికారులు ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది అని పేర్కొంటూ లారీ అడ్డాను అక్కడి నుంచి తొలగించారు. ప్రతిరోజు ఈ లారీ అడ్డాకు సుమారు 3వేల వరకు ఇసుక,ఇటుక,కంకర తదితర వాహనాలు వచ్చేవి. అయితే ఈ స్థలాన్ని అప్పటి రెవెన్యూ, పోలీస్ అధికారులు బలవంతంగా తొలగించడంతో వారు స్టేడియంవద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం కూడా ప్రవేటు వ్యక్తులకు చెందినది కావడంతో ఈ స్థలం వద్ద కూడా పార్కింగ్ తొలగించారు. ఇదే క్రమంలో పారిశ్రామికవాడలో దివాళాతీసిన కంపెనీలకు చెందిన ఖాళీ స్థలాలు వృధాగా పడిఉన్నాయి. కంపెనీలు నడపకుండా ఖాళీగా స్థలాలు ఉంచుకుంటే నిబంధనల ప్రకారం ఐలాకు తిరిగిఅప్పగించాల్సి ఉంటుంది. అయితే స్థలాలు తీసుకున్న కంపెనీల నిర్వహకులు వీటిలో అక్రమంగా పార్కింగ్ కోసం తమ స్థలాలను దారదత్తం చేశారు. ఉప్పల్ పారిశ్రామికవాడలో సుమారు 5వేల వరకు లారీలు నిత్యం వస్తున్నాయి. ఒక్కో లారీ నుంచి ప్రతి నెలా రూ.3 నుంచి ఐదు వేల వరకు నిర్వహకులు వసూలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి ప్రభుత్వానికి నయా పైసా ఆదాయం లేకున్నా వీరి పట్ల చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉప్పల్ నుంచి రామంతాపూర్‌కు వెళ్లే రహదారితోపాటు, జెర్సీ డైరీ ముందు ఉన్న ప్రభుత్వ స్థలంలో కూడా ఇదే విధమైన పార్కింగ్ దందా నడుస్తోంది. దీనిపై ఐలా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వ్యాపారుల నుంచి దండుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.

**ఐలా అధికారుల అండతోనేనా..? :** ఉప్పల్ పారిశ్రామికవాడలో ఐలా అధికారుల అండలోనే ప్రభుత్వం తక్కువ రేటుకు ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన స్థలాల్లో పార్కింగ్ దందా చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. లారీలు రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకుంటున్నామని చెబుతూ లారీ యజమానులనుంచి వేలల్లో డబ్బులు వసూలు చేస్తూ, ప్రభుత్వ స్థలంలో ఉచితంగా పార్కింగ్‌సదుపాయం కల్పించే అవకాశమున్నా ప్రైవేటు వ్యాపారులకు పార్కింగ్ వ్యాపారం అప్పగించారు. దీనిపై గతంలోనే పలు ఫిర్యాదులు ఉన్నప్పటికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం : ఐలా కమిషనర్ ...**

ఉప్పల్ పారిశ్రామికవాడలో అక్రమ పార్కింగ్‌పై తగు చర్యలు తీసుకుంటామని ఐలా కమిషనర్ ఉమా మహేశ్వర్ తెలిపారు. పారిశ్రామికవాడకు చెందిన కంపెనీలకు చెందిన స్థలాల్లో పార్కింగ్ చేసేందుకు వీలు లేదని, ఇటువంటి వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. జెర్సీ ఎదురుగా ఉన్న ఐడిఏ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు రూ.40వేలకు అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. లారీలు రోడ్డుపై పార్కింగ్ చేయకుండా ఉండేందుకు గతంలో ఇక్కడ పార్కింగ్ కల్పించారని, వీటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌పై రాచకొండ కమిషనర్‌కు బిజెపి ఫిర్యాదు

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** బిజెపి నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డిజిల్లా బిజెపిఅధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి రాచకొండ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో పాటు పలువురు బిజెపి నాయకులతో కలిసి కమీషనర్‌ను కలిసి మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి పిలుపు మేరకు ఇటీవల మంత్రి సబితారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన బిజెపి నిరసన కార్యక్రమం సందర్భంగా మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ బిజెపి నాయకులపై చేయి చేసుకొని దూషించారని కమీషనర్‌కు వివరించారు. వాటికి సంబంధించిన ఆధారాలను కమీషనర్‌కు చూపించారు. బిజెపి నిరసన సందర్భంగా మీర్‌పేట్ పోలీసులు అత్యుత్సాహం కనబరిచారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కడారి జంగయ్య యాదవ్, తర్రె మల్లేష్ యాదవ్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఆర్‌కు చిలుకానగర్ నేతల సంఘీభావం



బిఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డితో బేటి అయిన చిలుకానగర్ డివిజన్ నేతలు

**ఉప్పల్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి చిలుకానగర్ డివిజన్ నేతలు సంఘీభావం ప్రకటించారు. బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, గుడి మధుసూధన్‌రెడ్డి, కొంపల్లి రవీందర్, పిట్టల నరేష్, కొంపల్లి రాజ్‌కుమార్ తదితరులు బిఎల్ఆర్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఉప్పల్ నియోజకవర్గంలో మరోసారి బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం నుంచి ఒక్కసారి అవకాశం కల్పించాలని, పార్టీ అభ్యున్నతికి తన వంతు పాటుపడుతానని, కార్యకర్తలకు వెన్నంటి ఉంటానని పేర్కొన్నారు. డివిజన్‌లో త్వరలోనే భారీ ఎత్తున పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి



అస్సాం ఎమ్మెల్యే గోవల్లాను సన్మానిస్తున్న వినోద్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మలక్‌పేట నియోజకవర్గానికి విచ్చేసిన అస్సాం రాష్ట్ర ఎమ్మెల్యే తేరాష్ గోవాల్లాను మలక్‌పేట మార్కెట్లో తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యదర్శి అసోసియేషన్ అధ్యక్షుడు వంజరి వినోద్‌కుమార్‌ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మార్కెట్‌లోని గరుడ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగ్రికల్చరల్ ట్రేడర్స్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్, దదువై రాఘవేందర్, కేతం వెంకటేష్, వెంకటరమణ, రామ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్రబోస్, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీలు ఐక్యంగా పోరాడాలి: ఎల్.రమణ



పద్మశాలి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎల్. రమణ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** పద్మశాలి కులబాంధవులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ పేర్కొన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం నూతన కార్యాలయం ఏర్పాటు చేయగా భావన ఋషి గృహ నిర్మాణ సహకార సంఘం చైర్మన్ సీత ఆంజనేయులుతో కలిసి ఆదివారం ఎమ్మెల్సీ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత అభివృద్ధి కోసం గత 20 సంవత్సరాలుగా ఎల్బీనగర్ పద్మశాలి సంఘం పనిచేస్తుందని అన్నారు. కోసం సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం పట్ల ఆయన అభినందించారు. సీత ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలిల ఐక్యత ధ్యేయంగా ఎల్బీనగర్ సంఘం పనిచేయడం పట్ల ఆయన అభినందించారు. ఎల్బీనగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత మాట్లాడుతూ సంఘంలోని అందరి సభ్యుల సహకారాలతో పద్మశాలీల సంక్షేమంకోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, కొకుంట్ల రవితేజ, గుర్రం విశ్వేశ్వర్, తలాటి రమేష్, పడాల రవీందర్, జేల్లా జగన్నాథం, చెరిపల్లి ప్రభాకర్, కొత్త జగన్, విశ్వేశ్వర్, బొమ్మ రఘురాం, వేముల రాము, రావిరాల సంధ్యారాణి, చిక్కా భారతమ్మ, గర్దాసు చంద్రకళ, పూర్ణిమ, పేరాల సుజాత, కందగట్ల స్వామి, జగన్నాథం, మచ్చ ప్రభాకర్, సీత వెంకటేశం పాల్గొన్నారు.

## గిరిజన సాంప్రదాయానికి ప్రతీక తీజ్ పండుగ



గిరిజనులలతో కలిసి తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

**తుర్కయాంజాల్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** గిరిజనుల సాంప్రదాయానికి తీజ్ పండుగ ప్రతీక అని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ సాయిదయకాలనీలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ తీజ్ పండుగ సంబురాలను గిరిజనులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్‌నాయక్, కౌన్సిలర్లు బొక్క రవీందర్‌రెడ్డి, బొక్క శ్రీలత గౌతమ్‌రెడ్డి, నాయకులు మంగళనాయక్, శ్రీనివాస్‌నాయక్, కొండ్రు పురుషోత్తం, కందాడ లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, చెన్నయ్య, గోపాల్‌రెడ్డి, ఉపేందర్, కోర్ర రమేష్ నాయక్, భాస్కర్‌నాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీలలో విద్యార్థుల ప్రతిభ




తైకాండో పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న కార్పొరేటర్లు బన్నాల గీత, కక్కిరేణి చేతన తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 27 ప్రభాతవార్త :** తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబర్చిన ఉప్పల్ జోషి విద్యానికేతన్ విద్యార్థులను ఆదివారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత, హబ్సిగూడ కార్పొరేట్ కక్కిరేణి చేతన ఘనంగా సత్కరించారు. ఆదివారం ఉప్పల్‌లో జరిగినకార్యక్రమంలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ లో జోషి స్కూల్‌కు చెందిన విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనంనుంచి చదువుతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నతులుగా రాణించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మరింత మెరుగైన ప్రతిభ కనబర్చి దేశానికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జగదీష్ జోషి, కెడిఆర్ తైక్వాండో అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిజెపికి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధం కావాలి: అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో బిజెపికి పట్టం కట్టడానికి నియోజవర్గంలోని కాలనీలు, గ్రామాల ప్రజలు సిద్ధం కావాలని మహేశ్వరం నియోజవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన అందెల వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించి తీరతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, కాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

## ఈ నెల 29నుండి ఉచిత మిల్లెట్ అల్పాహారం




ఉచిత మిల్లెట్ అల్పాహారం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్ తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం 2023ను పురస్కరించుకుని గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు రోజువారి ఉచిత మిల్లెట్ అల్పాహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నయా మిల్లెట్స్ వ్యవస్థాపకుడు కె.అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని నయా మిల్లెట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్ జనరల్ అసెంబ్లీ 2023ను అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించే తీర్మాణాన్ని ఆమోదించింది. మిల్లెట్ల ఆరోగ్య ప్రయోజనాలు, వాతావరణ మార్పులద్వారా గుర్తించబడిన కఠిన పరిస్థితుల్లో వాటి సాగు అనుకూలతపై అవగాహన పెంచడానికి ఈ తీర్మాణం ఉద్దేశించబడిందన్నారు. ఏడాది పొడవున గర్భిణీలు, పాలిచ్చే తల్లులు ఆరోగ్యవంతమైన శిశు జనన, పెరుగుదలకోసం ఉచిత అల్పాహారం అందిస్తామని తెలిపారు. ఈనెల 29న గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందర్యరాజన్ చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నా: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితారెడ్డికి పూల వర్షంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** మహేశ్వరంనియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసి, ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి పట్లోళ్ళ సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఆదివారం రూ.12.38 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారంచుట్టారు. నిత్యం డివిజన్లలో పర్యటిస్తూ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కార్పొరేటర్లతో కలిసి అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పని చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు కేటాయిస్తున్న సిఎం కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామిడి కవితా రాంరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, జెనిగె పద్మఅయిలయ్యయాదవ్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, సంరెడ్డి స్వప్నవెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపికశేఖర్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమతాకృష్ణారెడ్డి, భీమిడి స్వప్నజంగారెడ్డి, అధికారులు, నాయకులు, సంక్షేమ సంఘాల వారు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బిసి బంధు చెక్కుల పంపిణీ : మైనంపల్లి



బంధు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**మల్కాజిగిరి, ఆగస్టు 27 ప్రభాతవార్త:** మల్కాజిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 250 మందికి బిసి బంధు లక్ష రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పంపిణీ చేసారు. అనంతరం ఆనంద్‌భాగ్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జగదీష్‌గౌడ్‌ను పరామర్శించిన మైనంపల్లి...** రెండు రోజుల క్రితం మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్‌కు యాక్సిడెంట్‌కావడంతో సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి ఆసుపత్రికి వెళ్లి జగదీష్‌గౌడ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీత రాముయాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, జితేంద్రనాథ్, జిఎన్‌వి. సతీష్‌కుమార్, రాముయాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్‌రెడ్డి, బాబు, సత్యనారాయణ, నర్సింగ్ రావు క్రాంతి, సతీష్, బాబన్న, సత్తన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో కాంగ్రెస్‌దే అధికారం: మిద్దెల

**సైదాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** చేవెళ్లలో కాంగ్రెస్‌పార్టీ నిర్వహించిన ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ ప్రజాగర్జన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని అన్నారు. సిఎం కెసిఆర్ మరోసారి ప్రజలను మోసం చేయడానికి కుట్ర చేస్తున్నారని, అయితే ఈ సారి బిఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాలే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



సామ సుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**సైదాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** యాకుత్‌పుర నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థిగా 2వసారి పోటీలో నిలవనున్న నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుందర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బిఆర్ఎస్‌ను మరోసారి భారీ మెజా ర్టీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పని చేసే ప్రభుత్వాన్ని ప్రజలు వదులుకోరని, రాష్ట్రంలో మరోసారి బిఆర్ఎస్ ఓట్లప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి : చిలుక

**ఎల్.బి.నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని చిలుకా నివాసంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా పోల్కంపల్లి గ్రామపంచాయతీ పరిధి మన్నెగూడ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.51వేల చెక్కును ఉపేందర్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి పునర్నిర్మాణానికి కృషి చేస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో పోలా రాజశేఖర్‌రెడ్డి, నందికొండ యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

## బిజెపి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** బిజెపికార్యకర్తలు సైనికుల పని చేయాలని కర్ణాటక ఎమ్మెల్యే రవికుమార్ పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ పరిధిలోని న్యూ నాగోల్ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజన భాగంగా ఎమ్మెల్యే ప్రవాస్ వర్క్ షాప్ శక్తి కేంద్ర ఇన్చార్జిలు బూత్ అధ్యక్షులు, నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని రానున్న ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేసే విధంగా కార్యకర్తలు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొని బూత్ కమిటీ పార్టీ కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.



శ్రావణమాసం సందర్భంగా వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భాగంగా సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)

## రోల్ మోడల్‌గా ఎల్‌బినగర్ నియోజకవర్గం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోకవర్గంలో ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకొంత అభివృద్ధిచేయాల్సి ఉందన్నారు. బాక్స్ డ్రెయిన్‌ల నిరా ్మణంతో వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందని, దాదాపు అన్ని కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, పాత యుజిడిల స్థానంలో నేటిఅవసరాలకు తగ్గట్లుగా నిర్మాణాలు చేపడుతున్నామని, అవసరమైన చోట నూతన కరెంటు పోల్స్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు, ధ్వంసమైన రోడ్ల స్థానంలో నూతన రోడ్లు, కాలనీలలో సిసి కెమరాలు, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎల్‌బినగర్ కూడలిని సిగ్నల్ ఫ్రీగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు లక్ష్మిప్రసన్న, నాయకులు మధుసాగర్, కందికంటి శ్రీధర్‌గౌడ్, పగిడిమర్రి తిలక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నర్రె శ్రీనివాస్, రాకేష్ ఠాగూర్, బెల్ద నర్సింహాగుప్తా, ఆనంద్‌గౌడ్, భాస్కర్, ఇంద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే మంచిరెడ్డి

**తుర్కయాంజాల్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాలతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ 10వ వార్డులో బిఆర్ఎస్ అధ్యక్షులు నల్లవెల్లి కార్తీక్‌కుమార్ అధ్యక్షతన వార్డు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పరిశీలకుడిగా దండుమైలారం మాజీ సర్పంచ్ చీమల జగన్నాథం హాజరై మాట్లాడుతూ ఎంఎల్ఏ మంచిరెడ్డి కృషి వల్లేనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి వార్డులో పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ దేవదాసు రవి, వార్డు మెంబర్ కాకి లింగం, గల్లయ్య, నాయకులు చెవుల దశరథ, కొమ్మని దయానంద్, చెక్క బాల్‌నర్సింహా, చెక్క మల్లయ్య, మెత్తరి అశోక్, చెక్క సుధాకర్, చెవుల నరేందర్, తావుల జగన్, చెక్క నర్సింహా, గుడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు డైరెక్టర్ సీతారెడ్డికి అభినందనలు



గడ్డం రంజిత్‌రెడ్డి, సీతారెడ్డిలను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** టిటిడి బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డికి పలువురు బిఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ 20వ డివిజన్ అధ్యక్షుడు వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రాజేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌చంద్రారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి తదితరులు వారి నివాసానికి వెళ్ళి రంజిత్‌రెడ్డి దంపతులను కలిసి సన్మానించారు. అదే విధంగా బంగారు మైసమ్మ దేవాలయ ట్రస్టీ బేర బాలకిషన్, కర్మన్‌ఘాట్ టెంపుల్ డైరెక్టర్ బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు ఎంపి దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## వార్డు కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన




వార్డు ఆఫీస్ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శేఖర్

**నాచారం, ఆగస్టు 27 ప్రభాతవార్త:** నాచారండివిజన్ ఓల్డ్ విలేజ్ వద్ద నూతనంగా రూ. 78లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వార్డు కార్యాలయం పనులను ఆదివారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశిలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసే విదంగా చర్యలు తీసుంటామన్నారు. అదేవిదంగా హనుమాన్ నగర్ కమ్యూనిటి హాల్, అంబేద్కర్ యువ జన సంఘం భవనం నిర్మాణం పనులను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికతో ముందుకెళ్లుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## మంత్రి సబితారెడ్డిపై బిజెపి మహిళా కార్పొరేటర్ వ్యాఖ్యలు సరికావు: బిఆర్ఎస్

**సరూర్‌నగర్, ఆగస్టు 27 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రిపై మీర్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లెలగూడ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సమావేశమైన నాయకులు దోమలపల్లి కుమార్, మహేందర్, నేనావత్ వాసుతో పాటు అంబేద్కర్‌నగర్ యువజన విభాగం నాయకులు మాట్లాడుతూ మంత్రితో పాటు కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిం చారు. రాజకీయాలు చేయాలే తప్ప వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని వారు బిజెపి కార్పొరేటర్‌కు హితవు పలికారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగచర్చకు ఎక్కడైనా సిద్ధమని వారు ప్రకటించారు. విమర్శలు చేసే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని వారు సూచించారు.

## బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : అజిత్‌రెడ్డి



అజిత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బట్టు దాస్‌రావు, గోపాల్ తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 27 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా తీగల అజిత్‌రెడ్డిని ప్రకటించడంతో మూసారాంబాగ్ డివిజన్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల్, బట్టు దాస్‌రావుల అద్వర్యంలో అజిత్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సిఎం కేసీఆర్ సారధ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమంకోసం పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.